

# చిలక

[కథానిక]

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

౧

నేను చక్కనివాణ్ణనే సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఈచక్కదనమే నన్నెన్నోసార్లు రక్షించింది. ఎన్నోసార్లేమిటి, ఒక్కసారి తప్ప అన్నిసార్లూనూ. నామీద కోపము వచ్చి విరోధులు కాబోయేవాళ్లు కూడా నా ఎదటికి వస్తే చక్కగా మాట్లాడి విరోధాలన్నీ మరచిపోయి వెళ్లుతారు. పాపము, ఒక్క మదనమోహనముమాత్రము మరవలేకుండా ఉన్నాడు. అతనైనా నన్ను ముఖముత్తి తేరిపార చూస్తే మరుస్తాడేమో!

నాకీ చక్కదనము పుట్టుకలోనే వచ్చి ఉంటుంది. కాని ఉన్న అందాన్ని పోకుండా ఆపిపెట్టుకున్నది మాత్రము నాయౌవనము.

నేను యౌవనమున్నవాణ్ణి అంటే నేను చిన్నవాణ్ణి అనకోరాదు. నాతోకూడా పుట్టినవాళ్లెంతమందో ఈపాటికి ముసలివాళ్లయిపోయినారు. కొంతమందికి పొట్టబుగ్గలు పడి ముఖాలు పీలగా ఐపోయి ముడుచుకొనిపోయినవి; రొమ్ములు ఈడుకొనిపోయినవి. మరికొంతమందికి వినాయకునికివలె బొజ్జలు పెరిగి పర్వతాకారాలు పడ్డాయి. అందరికీ తలలు ముగ్గుబుట్టలైనవి. గడ్డాలు, మీసాలు నెరిసినవి. ఇప్పుడు చూసినవాళ్లెవరైనా నాకూ, వాళ్లకూ ఒకటే ఈడంటే ఎప్పటికీ నమ్మరు. నాజుట్టు తుమ్మెదరెక్కలవలె ఉంటుంది. పళ్లుకూడా ధగధగలాడుతూ ఉంటవి. పాలుగారే నా ముఖమూ, ప్రేమ పొలికే నాకళ్లూ, బంగారము కమ్మిపోసినట్లుండే దీర్ఘమైన నా దేహయష్టి చూసి మాఊళ్లో ఉండే కవి "చిలకకు చిన్నప్పుడు వాళ్ల అమ్మగారు ఉగ్గుబాలల్లో అమృతం కలిపి పోసిందా ఏమి?" అంటాడు. నాదేహమంత మిసమిసలాడుతూ ఉంటుంది! మా అమ్మగారుకూడా చాలా చక్కనిదని పేరు పడ్డది కావడమే కాక ఆమె చనిపోయేదాకా నా అక్కచెల్లెళ్లకంటె చిన్నదిగా కనబడేది. ఒకటి రెండుసార్లు మా అమ్మగారు మా అక్కచెల్లెళ్లతో కలిసి పేరంటానికి వెళ్లితే "ఈమె మీ చెల్లెలా." అని మాఅమ్మగారిని చూపి మా అక్కచెల్లెళ్లను ఒకరిద్దరు అడిగినారట. అప్పటినుంచీ దిష్టిచేటని మా అక్కచెల్లెళ్లతో కలిసి మా అమ్మగారు పేరంటానికి వెళ్లేదికాదు. కాబట్టి మా తోబుట్టువులందరిలోనూ నా కొక్కడికే మా అమ్మగారి నిత్యయౌవనము అబ్బిందన్నమాట.

కాని మా కవి చెప్పినట్లుగా మా అమ్మగారు నాకు ఉగ్గుబాలల్లో అమృతం కలిపి పోయలేదు. మా అన్నలకంటేనూ, మా అక్కచెల్లెళ్లకంటేనూ నన్నామె ఎక్కువ గారాబంగా చూసేదన్నమాట నిజమేకాని ఆమెకు వాళ్లందరిమీదా అతిశయమైన వాత్సల్యముండేది. ఆమెకు అమృతములభిస్తే వాళ్లకుకూడా నాతో సమానంగా పోసేవుండేదే. అదిగాక ఈరోజుల్లో దేవలోకానికీ, భూలోకానికీ దారులన్నీ మూడిపోయినవంటారుగా!

పెద్దలంతా యౌవనము నిలబెట్టుకోడానికి మార్గాలు చెపుతూఉంటే నాకు నవ్వు వస్తుంది. సామాన్యంగా వాళ్లు బ్రహ్మచర్యముతోనే నిత్యయౌవనము వస్తుందంటారు. అందుకు నా దొక్కటే జవాబున్నది. ఉన్న ధనము కొస్తా మూటకట్టి భూమిలో పాతివేస్తే సంపద నిలుస్తుందా, దాన్ని వడ్డీలకిచ్చి పెంచుతూఉంటే పెరుగుతుందా? ఈ లోభులసేవాళ్ల పిపాసితవము ఒక్కటే లోకానికి కనబడుతుంది కాని

వాళ్ల ధనముమాత్ర మేమీ అభివృద్ధికాదు. అంతేకాకుండా చాలాకాలము భూమిలో ఉండడమువల్ల ఆ ధనానికి విలవకూడా నెమ్మదిగా తగ్గిపోతూఉంటుంది. తీరా దాన్ని తవ్వితే అది సగానికి సగం తగ్గిపోయి ఉంటుంది.

యౌవనముకూడా సరిగ్గా అంతే! ఒక సుందరికి కొత్త యౌవనము ఇచ్చామంటే మళ్లీ అక్కడనుంచి ఎంతయౌవనము మనము పుంజుకుంటామో ఎవరికి తెలుసును? నా కెందుకు, నాకుమాత్ర మిది బాగా అనుభవమే. నే నెంతమంది స్త్రీలతో సరససల్లాపాలు జరిపినానో లెక్కలేదు. పదిహేనేళ్లు పదహారేళ్లు వచ్చిన నవోఢలు ఎంతమంది! వాళ్లతో నేను గడిపిన మనోహరమైన రోజులూ, అప్పటి వాళ్ల దివ్యరూపాలూ, ఇప్పటి వాళ్ల క్షీణాకారాలతో పోల్చి ఆలోచిస్తే నాకు కన్నీళ్లుకూడా వస్తవి. వాళ్ల యౌవన మంతా పోయింది. కాని, నాదో? ప్రతిక్షణవిజృంభమాణమై ఉన్నది. ఇప్పటికీ ప్రథమయౌవనంలో ఉన్న లతాంగులకు నామీద పరిపూర్ణకటాక్షమే. నేను బ్రహ్మచర్యం ఎప్పుడు అవలంబించాను?

బ్రహ్మచర్యము అవలంబించ మనేవాళ్లు మహానుభావులే. వాళ్లను చూస్తే నాకు గౌరవమే. కాని వాళ్లు వచ్చినడబ్బు కాస్తా వాడక ఇంట్లో దాచుకోమని సలహాఇచ్చే లోభులవంటి వెర్రివాళ్లు. లోహధనముమీద వాళ్లకు నిరసనమే కాని యౌవనధనం మాత్రము లోభిత్వముతో ప్రవర్తించి ఉన్న దానివిలవ కాస్తా పోగొట్టుకోమంటున్నారు. చిన్నప్పుడే సన్యసించినవాళ్లను మన మెంతమందిని చూడడం లేదు? గౌరవంతోనము వాళ్లల్లో బ్రహ్మవర్చస్సు వెలుగుతున్న దని వందనము చేస్తాము. కాని పరీక్షగా చూస్తే, వాళ్ల కాషాయవస్త్రాల కాంతి మరచిపోయి నిదానించి చూస్తే, వాళ్ల నిజస్వరూపము బయట పడుతుంది. యౌవన మెక్కడ ఉన్నదో, ఎక్కడ లేదో కనిపెట్టడములో నా దృష్టి సర్చిలైటువలె ఆరితేరింది. ఇందులో నావలె స్పెషలిస్టును కానివాళ్లుకూడా అవివాహితలుగా ఉండి కట్టెగారిపోయిన పాశ్చాత్య స్త్రీలను వివాహితలతో పోల్చి ఒక్కసారి పరికిలిస్తే బ్రహ్మచర్యము యౌవనానికి ఎంత ప్రబలశత్రువో వెంటనే తెలుస్తుంది.

కాని ప్రస్తుతము నాకు వనితలతో ఐన సాహవాసాలసంగతి చెప్పను. అవన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క కథ! ఈ చుట్టుపక్కల ఊళ్లల్లోనే కాకుండా నే నెప్పుడూ చూడని పట్టణవాసాలకుకూడా అత్తవారిళ్లకు వెళ్లుతూ పిల్లలు నా దివ్యరూపాన్ని తమ హృదయాలల్లో గాఢంగా చిత్రించుకొని వెళ్లినారు. ఇప్పటికి, పాపము, బుల్లి 'లలిత' జ్ఞాపకము వస్తూ ఉన్నది. ఆమె ఇప్పుడు ఏ కల్పవృక్షపు నీడకిందనో కూర్చొని స్వర్గవాసనలు ఆఘ్రాణిస్తూ, వాటికంటే తియ్యనైన మా ప్రణయ విహారాలు తలచుకుంటూ తన గులాబి పెదవులతో చిరునవ్వు వెన్నెలలు నందనవనమంతా చల్లుతూ ఉండదనా!

నా యౌవనము నిజంగా నిలవ పెట్టినది ఏమిటంటే, ముఖ్యంగా జ్ఞాపకంవచ్చేవి,— లలిత పెదవులూ, కమల కళ్లూ, రత్నము కపోలములూ — లేత తమలపాకు చేతితో తాకినప్పుడల్లా రత్నము పుట్టుతున్నట్లే ఉంటుంది, వేణి స్తన లచ్ఛములూ, లక్ష్మీ కరపల్లవములూ, రాజ్యము పాదపద్మములూ, మరీ ఆ సీత నాభి! — ఇటువంటివేగా! మరీ ఆ సీత నాభి ఉన్నదే, అది నిత్యయౌవనపు సరస్సేకాదూ! వెర్రిపిల్ల, నన్ను చూస్తే వణికేది కాని నన్ను విడిచి ఒక్క క్షణం సేపు కూడా ఉండలేక మళ్లీ వెంటనే పరిగెత్తుకొని వచ్చేది!

౨

బ్రహ్మచర్యం నిలుపుకో మని చెప్పే వాళ్ల మాటల సారాంశము ఆలోచిస్తే, స్త్రీ సహవాసాలు వదిలిపెట్టి పురుష సహవాసాలు చేయమనడంకంటె మరేమీ నాకు కనపడడంలేదు. వాళ్ల మాటలు నాకు సమ్మతము కాకపోయినప్పటికీ అవి తల్లకిందులుచేసి పురుషసహవాసం వదిలిపెట్టమనాను. నా కెందుకు, నేను పురుషులతో చేసే సాహవాసాలు పురుషులతో చేశాను, స్త్రీలతో చేసేవి స్త్రీలతో చేశాను. ఇంతే కాదు. నాకు నిత్య యౌవనము అబ్బిందంటే ఎప్పుడూ చిన్నవాళ్లతోనే ఉండేవాణ్ణి అనుకోవడము సహజము. కాని అది ఏ మాత్రమూ సత్యము కాదు. డెబ్బై ఎనభై ఏళ్ల వృద్ధులుకూడా నాకు ప్రియులే. వృద్ధాప్యాన్ని చూసి భయపడ సాగినామా, అది మరీ వెంటనే మీదికి పెనుభూతము వలె దూకుతుంది. అట్లాగే చక్కనివాళ్లే గాక అనాకారివాళ్లుకూడా నాకు మిత్రులే. అటువంటి ఒకానొక కురూపితో నాకైన మైత్రి సంగతే ఇప్పుడు చెప్పదలచుకున్నాను. శత్రువులను మచ్చిక చేసుకోవలెగాని విరోధిస్తే చివరకు ఒక వేళ వాళ్లు ఓడిపోయినా ఈ మన్న పెట్టే చికాకుతో మన శక్తి సగం చంపుతారు. అంతేమటుకు వాళ్ల జయం నిశ్చయము! నా కెందుకు, నేను మాత్రము చికాకు పడలేను. నా కంతా పూలమీద నడిచిపోతున్నట్లు ఉండవలె. నే నెన్నడూ బొమలు ముడివేసుకొని కాని, కళ్లు ఎఱ్ఱచేసి కాని ఎరగను. ఎప్పుడన్నా ముఖమంతా ఎఱ్ఱవారిన కనిపించినా అది రాగాధిక్యము వల్లనే కాని మరెందువల్లా కాదు. కళ్లనీళ్లెప్పుడైనా విడవడం కద్దు. నేను హృదయపూర్వకంగానే కంట తడిపెడతాను. ఐనా చూసేవాళ్లకు అది విలాసచేష్టగా ఉంటుందట. అది లలిత నన్ను విడిచి వెళ్లేప్పుడు నాకు మొదట తెలియవచ్చింది. అప్పుడు నేను కన్నీళ్లు పెట్టుకుంటే లలిత నావద్దకు పరుగెత్తుకొని వచ్చి నా కన్నీళ్లు తుడిచి "అట్లా కన్నీళ్లు కార్చినావా అంటే అసలు నిన్ను విడిచి పోలేను చిలకా!" అని తన గులాబి పెదవులతో నా కన్నులు తాకింది.

ఇందువల్ల నేను చెడ్డవాణ్ణి అనుకోరాదు. అసలు నా ఉద్దేశము అందరిచేతా మంచి

అనిపించుకోడానికే ఈ లోకంలో పుట్టినా మని. ఇక, నాకు తెలిసినంతమటుకు నా అంత మంచి అనిపించుకున్నవాళ్లు ఎవ్వరూ లేరు. నే నెక్కడ అడుగుపెట్టితే అక్కడ సమస్తమూ మధుర మైపోతుంది. అందుకోసమనే మా ఊళ్లో కవి "మన చిలక ఎక్కడ ఉంటే అది ధర్మ యుగములోని బుష్యాశ్రమ మవుతుంది" అంటాడు. నా హృదయము సముద్రమువలె విశాల మైనది. అందువల్లనే భూమిని అంతా చుట్టుకొని ఉన్న సముద్రంవల్లనే లోకాన్ని అంతా నేను ప్రేమిస్తాను.

ఈ లోక మంటే ఎంత ఇష్టమో నాకు పుస్తకాలలో మనుష్యు లంటే కూడా అంతే ఇష్టము. నేను చదివే పుస్తకాలకు మేర లేదు. వనంలో దుష్యంతుణ్ణి చూసి మోహించిన శకుంతలను గురించి చదువుతూంటే, పాపము, నా లక్ష్మి జ్ఞాపకం వస్తుంది. అట్లాగే రాధ! మరీ అపుర్వ బాణవిలాసము, అమరుశతకం, గాథాసప్తశతి, ఆర్యాసప్తశతి—అటువంటి కావ్యాలలో నాయికలంటే నాకు మహా ఇష్టము! అక్కడ పద్యానికి ఒక నాయిక ఉంటుంది. ఏమి వాళ్ల మాధుర్యము! రామాయణము, మహాభారతము చదవడంకూడా నాకు ఇష్టమే కాని సీతా, సావిత్రీ, గాంధారీ, అరుంధతీ — వీళ్లంతా మా అమ్మగారిని జ్ఞాపకానికి తెస్తారు.

ఇక మనదేశపు కావ్యాలే కాక పాశ్చాత్యుల కావ్యాలుకూడా నాకు బాగా పరిచయమే. ఆ హెలెనా, క్లియొపాత్రా, గినివియరూ, లారా, మార్గరెటూ—వీళ్లంతా నాకు చిరపరిచితులే. పురుషులలో వార్కి- పసు డాగ్ జాగ్ మరీ నచ్చినారు. బైరను, షెల్లీ లంటేనూ, వాళ్ల కవిత్వ లంటేనూ నా అభిప్రాయం వేరె చెప్పడ మెందుకు! కొంతవరకు ఆస్కారువైల్డు అంటేకూడా నాకు అభిమానమే. వాళ్లు స్వర్గంలోనుంచి జారిపడ్డ అమృతపు చుక్కలే కాదూ! అటువంటివాళ్ల ప్రాతలవల్లనే యౌవన మింకా నశించిపోకుండా ఉన్నది లోకంలో. లేకపోతే కమలవంటివాళ్లూ, వేణివంటి వాళ్లూ పుట్టడ మిప్పటి కెప్పుడో మానేసి ఉండేవాళ్లే!

## 3

నేను స్త్రీసాహసాలూ, పురుషసాహసాలూ చేసినవాళ్లే ఐనప్పటికీ ప్రస్తుతము స్త్రీసాహసాల సంగతి చెప్పదలుచుకోలేదన్నాను. కాని ఎంత మరుద్దామన్నా మరుపురాక ఆ స్త్రీసాహసాలే మాటిమాటికీ జ్ఞప్తికి వస్తున్నవి. కొంతమంది స్త్రీపురుష జాతులలో ఒకజాతికే అందమూ, ఆకర్షణా ఎక్కువ ఉన్న దంటారు. కాని నే నది ఒప్పుకోను. ఐనా నాకు మాత్ర మెందువల్లనో స్త్రీసాహసాలయందే ఎక్కువ ఆకర్షణ ఉన్నట్లున్నది. లేకపోతే నా పురుషసాహసాలలో ఒకదానిసంగతి చెప్పబోయి నాలలితసంగతీ, సీతసంగతీ, రత్నము కపోలములసంగతీ-ఇవన్నీ చెప్పడ మెందుకు? నేను పురుషుణ్ణి కాబట్టే కాబోలును, స్త్రీ లంటే నా కంత ఎక్కువ ఉల్లాసము! ఐనా ఇట్లా అసందర్భంగా మాట్లాడడము నాకు స్వభావసిద్ధమే. "చిలకా, ఒకటి చెప్పబోయి ఇంకొకటి చెప్తూ ఉంటావేం?" అని ఎప్పుడూ అంటూ ఉంటారు నా స్నేహితులంతా. నిజంకూడా అంతే. నాకు వాక్స్థానమందు శని ఉన్నాడని జ్యోస్యు డన్నాడు. అందువల్లనే ఏది తోస్తే అది మాట్లాడుతాను. దుష్యంతుడు చెప్పినట్లుగా అంతఃకరణప్రవృత్తులే సజ్జనులకు ప్రమాణములు! కాబట్టే తోచినపని చేస్తూ ఉంటాను, తోచినమాట అనేస్తూ ఉంటాను. దుష్యంతుని కున్నట్లు నాకు సందేహముమాత్ర మేమీ లేదు.

నేను మాట ఆపనని నా స్నేహితులు నాకు రహస్యాలు చెప్పడానికి భయపడతారు. "మనస్సుకు తోచింది చేస్తావుకాని కాస్త ఆలోచించవేమి చిలకా!" అంటారు నామీద విశేషాదరం కలవాళ్లు! వాళ్లమాటలకు సామాన్యంగా చిరునవ్వునవ్వి ఊరుకుంటాను. వాళ్లూ చెప్పి ప్రయోజనంలేదని ఊరుకుంటారు. అట్లా కాకుండా వాళ్లను ఆడించవలెనన్న బుద్ధి పుట్టిందా, "అవును బాబూ, నాకది పెద్దలోపమే. ఎంత ప్రయత్నించినా సవరించుకోలేను!" అంటాను. అక్కడినుంచీ వాళ్లు పెద్దపెద్దఉపన్యాసాలిస్తారు. "ఆలోచించకుండా ఏకార్యమూ చేయరాదు" అనే తాత్పర్యంగల సామెతలన్నీ ఇంగ్లీషులోవి, సంస్కృతంలోవి, తెలుగులోవి, కన్నడంలోవి, హిందీలోవి, బంగాళీలోవి, కొంతమంది మరాఠీ గుజరాతీ భాషలలోవీ కూడా చెప్తారు. నే నవన్నీ చాలా విచారంతో విని "ఇన్ని భాషలు చెపుతున్నా నా లోపము సర్దుకోలేకుండా ఉన్నాను, ఏమిచేయను!" అని నిట్టూర్పు విడుస్తాను. ఐనా ప్రయత్నించి చూడమని వాళ్లు ఎంతో హృదయపూర్వకంగా బోధించి చూస్తారు. "నేను నేటినుంచే తప్పక ప్రయత్నిస్తాను" అంటాను. వాళ్లూ సంతోషించి ఊరుకుంటారు.

కాని చాలామంది అజాగ్రత్తలో ఉన్న వివేకం ఎరగరు. నా అభిప్రాయాలన్నీ నా అనుభవాన్ని బట్టే ఉంటవి. నే నెప్పుడూ తోచిన పని చేస్తూ ఉండడమువల్లనే నన్నంతా "చిలకబుద్ధి అమృతమువలె స్వచ్ఛమైనది. అందులో కల్మషముండదు. అతను ఈకాలపు మనిషి కాదు" అంటారు. నేనే గనక ఆలోచించి జాగ్రత్తగా ప్రతిది మాట్లాడుతూ ఉన్నానంటే 'లోపలలోపల స్వయంపాకా'మనీ, 'మాచి'అనీ, 'టక్కరు'అనీ నన్ను లోక మనకపోదు. ఇప్పటివలె లోకము నన్నప్పుడు నమ్ముతుందా? ఇక ఆలోచించి చేయడమువల్ల ఫలిత మేమున్నది, జనులకు మనమీద ఉన్న విశ్వాసం పోగొట్టుకోవడమే కదా! నాకు ఎన్నడూ అలవాటులేని ఆలోచన చేసి మాట్లాడినందువల్ల నాకైన శాస్తికూడా కాస్తనేపటిలోనే చెపుతాను వింటారుగదా!

నా స్నేహితులంతా నాకిట్లా జాగ్రత్తగా ఉండమని ఉపదేశాలు చేస్తారన్నమాటే గాని ఏదైనా రహస్యము నాతో చెప్పకుండా దాచుకోలేరు. నన్ను చూడగానే "చిలకా, నీకొక రహస్యము చెపుతాను, ఎవరికీ చెప్ప

పోకు!" అని నేనటువంటి వాగ్దత్తమేమీ చేయకముందే ఆ రహస్యము నాకు చెప్పేస్తారు. వాళ్లు మాటిమాటికీ నన్ను 'చిలకా చిలకా' అని పిలుస్తూ ఏదో చెప్పుతూ ఉండకుండా ఊరుకోలేరు.

ముందిప్పుడు నాపేరు చిలక అని ఎందుకు వచ్చిందో చెపితే బాగుంటుందేమో! నేను చిలకనంటే 'శుకసప్తతి'లో వచ్చి మాట్లాడే పక్షిజాతిలో చేరిన చిలకనని ఆంధ్రపండితులు కూడా ఇంతవరకూ విన్నట్లయితే భ్రమించి ఉండరు. నేను మొదటినుంచీ చక్కగా బట్టలు దిద్ది కట్టుకొని దేహ మెప్పుడూ థగ థగలాడుతూ ఉండేట్లు శుభ్రంగా ఉంచుకొని, నాయికాగమనము నిరీక్షించే నాయకునిలా మోహనంగా ఉండేవాణ్ణి. ఇప్పుడూ అంతే. ఇంతేకాకకూడా నాకు కుణానికి ఒక రకమైన అలంకారము చేసుకోవడ మిష్టము. నేను ఏ అలంకారము చేసుకున్నా నాకది కుదిరిపోతుంది. అందువల్లనే మావూళ్లో కవి "చిలకకోసమే ఈ అలంకారాలన్నీ లోకంలో పుట్టినవేమో!" అంటూ ఉంటాడు. సరే! నా అలంకారప్రియత్వము చూసి ఇంగ్లీషు చదువుకున్న నాస్నేహితులు 'బటరుఫ్లై'కి తర్జుమాచేసి 'సీతాకోకచిలక' అనేవాళ్లు. కాని ఇంగ్లీషు చదువుకోకపోవడంవల్ల దాని చమత్కారం బాగా తెలియని మావూళ్లో కవి "అంతపేరు బాగుండలేదు. 'చిలక' అని మాత్రమే ఉంటే బాగుంటుంది" అన్నాడు. అక్కడినుంచీ నన్నంతా 'చిలక చిలక' అని పిలవడం సాగించినారు. అందుచేత నా అసలుపేరు చెప్పినా చాలామందికి తెలియదు. నేనే నా అసలుపేరు మరిచిపోయినట్లున్నాను. అది జ్ఞాపకం చేసుకోవడానికి నే నిప్పు డవస్థ పడలేను. ఎందుకూ, దానికోసము వృథా ప్రయాస పడడము!

౪

ఇప్పటికి రెండుసార్లు ప్రయత్నించినా అసలు కథలోకి రాలేక పోయినాను. ముఖ్యంగా మూడోసారి ప్రయత్నంచేస్తాను. కా... ఉన్నా కష్టం లేకుండా నా ప్రయత్నం సఫలం కాకపోతుందా! ఐనా చూతాము, ఇంతలో ఒరిగిపోయే దేమున్నది! నే నిప్పుడు పరీక్షకు కూర్చోలేదుగా! అంతగా ఐతే ఇంకోసారికూడా అప్రస్తుత ప్రశంసలోకి దిగుతాను!

ప్రస్తుతము నా స్త్రీసహవాసాల సంగతి చెప్పదలచుకోలేదు. పురుష సహవాసాలన్నిటినీ గురించికూడా చెప్పడానికి తలపెట్టలేదు. అందులో ఒకదాన్ని గురించిమాత్రమే చెప్పదలచుకున్నాను. అది మదనమోహనంతో నాకు వచ్చిన భేదముసంగతి! అవును, అతనితో నా సావాసముసంగతి కాదు, భేదముసంగతే, నేను చెపుతాను!

నన్ను చూస్తే ఎవరికీ విరోధభావము కలగదు. నేను దూరాన ఉన్నప్పుడు ఒకవేళ కలిగినా నన్ను చూస్తే వాళ్ల కది కాస్తా మాయమైపోతుంది. ఇదంతా నిజమే. కాని ఒక్క మోహనం విషయంలో నాకు భేదభావము కలిగిన దన్నమాటకూడా నిజమే. భేదభావము నాకు కలిగిన దనడము పొరపాటు, అతనికే నావిషయంలో ఆ భావము కలిగినది!

నేను చక్కనివాళ్లతోనే గాక అనాకారివాళ్లతోకూడా సమానంగా సావాసం చేస్తూ వన్నాను. మదనమోహనం పేరు ఎట్లా ఉన్నా నిస్సంశయముగా అతను ఆరెండో జాతిలో చేరినవాడు. నా స్నేహితులలో అపహసించే స్వభావము గలవాళ్లు "లోక పితరుడైన బ్రహ్మదేవుడు అందం పెట్టక పోయినా, మదనమోహనం తండ్రిగారు మాత్రము పేరులో అతన్ని మోహనాకారుణ్ణి చేసినారు" అని పరిహసించే వాళ్లు. చక్కని ... గనున్నా, ఏ పుల్లయ్య అనో ... పేరు ... వాళ్లు ఒక్కరునవ్వులు నవ్వుతూ "నీ కేమయ్యా, ప్రేమావతారమైన పేరున్నది!" అనేవాళ్లు.

కాని నేను మదనమోహనాన్ని ఒక్క మాట ఐనా నా ఎదట అననిచ్చేవాణ్ణికాదు. అనాకారితనంమీద ప్రేమ ఇది నాది తెచ్చి పెట్టుకున్నది కాదు. అది మనస్సులోపల నుంచి స్వయంగా వచ్చేదే. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్లు అవతలవాళ్ల అనాకారితనం ఆదరాతిశయంవల్ల తెలియకపోవడం కూడా కాదిది. ఏది అందమో, ఏది కాదో తెలుసుకోవడం నాకు తెలిసినట్లు లోకంలో మరెవ్వరికీ తెలియ దని ప్రతీతి పడ్డవాణ్ణి. చివరకు చిత్రకారులుకూడా తమ బొమ్మలు చూపి నా సలహా అడిగి నేను గనక బాగున్న దంటేనే ప్రతిపత్తి పెట్టుతూ ఉంటారు. మదనమోహనం రూపములో ఒక్క దంతపంక్తికి తప్ప ఆ బ్రహ్మదేవు డింకెక్కడా అందము కల్పించలేదు. "ఆ అనాకారి ముఖంలో అటువంటి మంచి దంతపంక్తి ఉండడముకూడా ఎక్కిరించినట్లుగా ఉంటుంది" అనేవాళ్లు నా స్నేహితులు! కాని ఆమాటల్లో ఎంతవరకు సత్యమున్నదో నా కింకా నిర్ధారణ కాలేదు. కాని అందంలో ఏమి లోపమున్నా అంతటినీ అతని సరసత్వము మరిపిస్తుంది.

నే నతనితో సావాసం చేస్తున్నప్పటి నుంచీ నాపూర్వస్నేహితు లంతా ఆశ్చర్యపడ సాగినారు. ఎందుకో, అతను సరసుడు కాదనికూడా వాళ్ల అభిప్రాయము. "మన చిలక ప్రతిది ఆలోచించకుండా చేస్తాడు. చెపితే వినడు. ఏం చేయగలము!" అనుకునేవాళ్లు. కొంతమంది నా వద్దనుంచి కొంచెము దూరంగా తొలిగి ఉండవలెనని ప్రయత్నంకూడా చేసినారట గాని వాళ్లకది సాధ్యము కాలేదు. నన్ను చూడకుండానూ, నాతో మాట్లాడకుండానూ ఒక్క రోజుకూడా వా ళ్లుండలేరు.

ఆపైన కొన్నాళ్లల్లో నెమ్మది నెమ్మదిగా నా స్నేహితులంతా మా సావాసానికి అలవాటుపడ్డారు. కాని అప్రయత్నంగా వాళ్లకు మోహనంమీద ఇంకా మిగిలిఉన్న అయి

ష్టము వాళ్లు బయటపెట్టకుండా ఉండలేక పోయేవాళ్లు. ఏదో విధంగా మోహనాన్ని ఎక్కిరిస్తూనే ఉండేవాళ్లు. మే మిద్దరమూ ఒకచోట ఉంటే హంసా కాకీ ఉన్నట్లుగా ఉంటామట. ఈవిధమైనవే ఎన్నో ఉపమానాలు కల్పించేవాళ్లు. 'కప్పా, చిలకా కలిసి ఉన్నట్లు' అనేవాళ్లు! నా పూర్వ స్నేహితులు ఇంత మోటుగా ప్రవర్తిస్తారేమా అని ఒక్కొక్కప్పుడు నాకు విచారము కూడా కలిగేది. నే నేమన్నా వాళ్ల నడిగినా "మేము చెప్పినదాంట్లో అబద్ధ మే మున్నది? నీవల్లనే మాకు తోచింది మే మంటున్నాము, తప్పేమున్నది చిలకా?" అని నామాట నాకు అప్పగించి టక్కరు నవ్వులు నవ్వేవాళ్లు.

ఇక మోహనంసంగతి! అతనితో నేను మాట్లాడుతూ కూర్చుంటే నాకు ఆనంద మయంగా ఉండేది. లోకంలో ఉన్న సమస్త దేవశక్తులనూ మైత్రి కలుపుతే అది ఎంతగాఢంగానూ, మనోహరంగానూ ఉంటుందో మా మైత్రి అంత మనోజ్ఞంగా ఉండేది. సంభాషణలో అతన్ని నేను మాటి మాటికీ మదనా మదనా అనీ, మోహనా మోహనా అనీ సంబోధిస్తూ ఉండేవాణ్ణి. అతనూ అట్లాగే నన్ను చిలకా చిలకా అంటూ ఉండేవాడు.

కాని మా స్నేహానికి నా పూర్వస్నేహితులు పావకంలో పుడకలులాగా ఉంటూ ఉండేవాళ్లు. మదనమోహనంకూడా నేతి నైవంకవరకు వాళ్లు నాదగ్గర ఉండని సమయంలోనే నాతో మాట్లాడి పోతూ ఉండేవాడు. కాని నా స్నేహితు లందరితో అతనికికూడా నెమ్మదిగా అనురాగబంధము ఏర్పడసాగింది. వాళ్లు మాత్రము నే వింతగా ప్రేమిస్తున్న మోహనాన్ని కొంత ఐనా ప్రేమించకుండా ఎట్లా ఉంటారు! రోజు లంతకంతకు సౌమ్యముగా గడిచిపోసాగినవి.

*

మోహనంలో చక్కదనం లేకపోయినా విపరీతమైన ఉల్లాసం మాత్ర ముండేది. అందువల్లనే నా పూర్వ స్నేహితులు అతనంటే ఇష్టంలేని మొదటి రోజుల్లో, పాపము, కొంచెము నిర్దయతో "లోకంలో కల్లా చక్కని వాడికైనా ఇంత ఉల్లాస ముండదు" అనేవాళ్లు. ఉల్లాస పూర్ణమైన ముఖంతో అతను నన్ను రోజూ ఒక్కసారన్నా కలుసుకొని మాట్లాడిపోతూ ఉండేవాడు.

కాని ఒకపర్యాయము వరసగా రెండు రోజు లతను రాలేదు. ఏమా కారణ మని ఆశ్చర్యపడ్డాను. మూడో రోజు కూడా వచ్చింది. ఉదయం దాటింది. మాట్లాడడానికి వచ్చిన స్నేహితు లంతా వెళ్లిపోయినారు. కిటికీలోనుంచి మోహనం ఇవ్వాళైనా వస్తాడేమో నని చూస్తున్నాను. దూరాన అతని ముఖం కనపడ్డది. నాముఖం మామూలు కంటె విప్పారింది.

కాని అతను లోపలికివచ్చి ముఖం చూసే ప్పటికి నా సంతోష మంతా పోయింది. అతను మామూలువలె లేడు. అతని ముఖంలో ఉల్లాసమనే మాట లేదు. ముఖాన తెర దింపి నట్లుగా దైన్యము వేలాడుతున్నది. సహజ సురూపి ఐన అతనికి,పాప,మది భయంకరా కారము కలిగించింది. అతని కళ్లవెంట నీళ్లు కూడా వస్తున్నట్లున్నది.

నేను దుఃఖపడేవాళ్లను చూడలేను. అది కాఠిన్యమువల్ల కాదు; అదరాతిశయము వల్లనే. పిల్లలు చనిపోతున్నప్పుడు ఆ భయం కరాకారము చూడవలసి వస్తుందని చూసి రావన్న గటే నాకెప్పుడూ జ్ఞాపకంవస్తాడు. అందువల్ల అప్పుడు నేను తొందరలో "విశేష మేమిటి మదనా?" అన్నాను.

కొంతసేపటిదాకా అతను నోరెత్తి మాట్లాడలేదు. చివరకు ముఖము అవతలికి తిప్పుకొని మాట్లాడినాడు. "చిలకా చిలకా, రెండురోజులబట్టి ఓర్చుకున్నాను. ఇవ్వాళ నీదగ్గరికి రాకుండా ఉండలేకపోయినాను!" అన్నాడు.

నేను కొంచెము ఆదుర్దాతో "ఎవరన్నా నిన్ను అవమానించినారా ఏమి మదనా?" అన్నాను.

"నన్నెవ్వరూ అవమానించలేదు. నా దురదృష్టమే! దానికి నేనేమి చేసేది!" అని కొంచెము రోదన మారంభించినాడు.

నాకు గాభరాపేసింది. నేను స్వయంగా రోదనము చేయలేను. ఇతరులు రోదనము చేస్తూఉంటే చూడనుకూడా చూడలేను. కాబట్టి కూర్చున్న వాణ్ణి అక్కడినుంచి చివా లున లేచి అతనిముఖం ఉన్న వేపుకు వెళ్లి "అట్లా ఏడవక సంగ తేమిటో త్వరగా చెప్పు!" అన్నాను.

నే నటు వెళ్లగానే అతను తన ముఖ మంతా దోసిట్లో మూసుకొని "అవతలికి పో చిలకా! నీవు నా వెనకకు వెళ్లు చిలకా! అందాకా నీతో మాట్లాడను!" అన్నాడు. వచ్చినప్పటినుంచీ ముఖము నాకు కనపడ కుండా ఉండేవిధంగా కూర్చున్నాడని నా కప్పుడే స్పష్టమయింది.

అంతకుమునుపు నాతో ఎవ్వరూ అంత మోటుగా మాట్లాడి ఎరగరు. అందువల్ల ఆనాడు మోహనం అట్లా మాట్లాడడము మహాసోద్యమయింది. మొదట అది కొద్దివిర సమైన హాస్యమేమో అనుకున్నాను. కాని చూడగా ఆదుఃఖము నటనగా కనపడలేదు. కొంతసేపు ఆలోచించి నెమ్మదిగా అవతలికి వెళ్లినాను. నేను అవతలికి వెళ్లేవరకూ మాన భంగమైన స్త్రీవలె 'పో పో'అంటూ అతను ముఖం దోసిట్లోనే పెట్టుకొని అరుస్తున్నాడు.

నివ్వెరపోతూ నేను యథాస్థానానికి వచ్చి "ఇక ఏమిటో చెప్పు"మన్నాను.

అప్పుడుఅతను నెమ్మదిగా దోసిట్లోనుంచి ముఖమెత్తి "చిలకా, నీకంటె వేరే నాకాప్తు లెవరూ లేరు. నా దుఃఖభారము నీకుకూడా చెప్పకుండా దాచవలె నని రెండురోజుల నుంచీ ప్రయత్నించినాను కాని నా కది సాధ్యము కాలేదు. నా శోకభారము దుర్భర

మయింది. ఈసంగతి ఎవరితో చెప్పవుగదా!" అన్నాడు.

అప్పటికే నాకతనితో మాట్లాడడం విసుగు పుట్ట సాగింది. కష్టపడుతున్న వాళ్లతో ఎక్కువసేపు ఉండలేనని మునుపే చెప్పినానుకాదూ! అందుకని ఎట్లాగో అట్లా తప్పించుకోడానికి "సరేలే చెప్పు"అన్నాను.

"ఎవరితో నన్నా చెప్పేవుసుమా!" అని మళ్లీ అన్నాడు.

"రహస్యాలు దాచడం నా చేతకాదు. అందుకు ఒప్పుకుంటేనే చెప్పు! లేకపోతే చెప్పనేవద్దు!" అందా మనిపించింది. నాలిక చలనంకూడా ప్రారంభించినది. కాని దుర్బుద్ధి పుట్టేవేళకు అనవలసిన వాక్కు నోట వస్తుందా! అనుకున్న ఆమాటలు నాలిక తోనే ఆగిపోయినవి. తోచినమాట అనేసే స్వభావమున్న నేనుకూడా ఆ ఒక్కసారికీ తోచిన ఆమాటలు అనక అతన్ని కొంత సంతోష పెట్టడము కోసము "ఎవరితోనూ చెప్పనులే, చెప్పు!"అన్నాను. అట్లా తోచిన మాట అనక ఆలోచించి మాట్లాడిన ఫలితము ఎంత భయంకరంగా నా అనుభవానికి వచ్చిందో త్వరలోనే చెప్తాను. సైతాను ప్రేరేపణకు లొంగిపోయిన ఆదాముహవ్వల గతే నాకు పరిస్థా పట్టింది.

నేను వాగ్దత్తము చేయగానే మోహనం కొంచెము శాంతము తెచ్చుకుని గొంతు సవరించుకొని ఇట్లా చెప్పసాగినాడు:

"చిలకా, నాదంతపంక్తి సొగసుగా ఉంటుందని నీవుకూడా ఎప్పుడూ అంటూ ఉంటావు. నేనుకూడా అద్దంలో నాటి అందం చూసి తనివితీరక పదేపదే చూచుకుంటూ ఉంటాను. ఇక నా కా భాగ్య మేదీ! ఎవరన్నా ఓర్చలేనివాళ్లు ఏ చాతబడి విషా చేసినారేమో! దంత మొకటి లోపలిది మొన్న తెల్లవారేప్పటికి ఊడి పక్కలో పడిఉన్నది. మొదట అది నాది కాదేమో అనుకున్నాను. కాని అంత చక్కని దంతము నాకు కాక పోతే మరి ఎవరికి ఉంటుంది! నాపక్కలో ఉన్న దంతము చూసినకొద్దీ నాదేనేమోనని అనుమానం పుట్టసాగింది. చివరకు నా నిలువు టద్దంలో పోయి చూసుకుందునుగదా, నేను భయపడ్డదే నిజమయింది. అప్పుడిక నాకెట్లా ఉన్నదో ఏమి చెప్పేది! ఇంకా జీవించడం ఎందుకా అనిపించింది. లోకముముఖ మెట్లా చూస్తానా అనుకున్నాను. లోక మంతా తొర్రిపోయిన నా నోటినే చూస్తూ ఎక్కిరిస్తున్నట్లుగా తోచింది. చిలకా, నీ కెట్లా నా ముఖము చూపుతానా అనుకునేప్పటికి ఏడుపు వచ్చింది. ఈ రెండురోజులనుంచీ గదిలోనుంచి బయటికి రాక నిద్రాహారాలు లేకుండా ఒకటేతీరున విలపిస్తున్నాను. ఇప్పుడు చివరకు నీకు కూడా చెప్పకోక పోతే మనసునిలవక చెప్పడానికి వచ్చినాను"

మాట్లాడడం చాలించి మదనమోహనం నా వైపుకు ముఖం తిప్పినాడు. అతని ముఖమప్పుడు చూస్తే నాకు చాలా చింతకలిగింది అనుకున్నాను. కాని అతను "చిలకా, నీవు ఎంత కఠినుడివి! నా ఆక్రోశన వినికూడా నీ వేమాత్రం చలించవేమి!" అన్నాడు.

"కాదు మదనా, నేను నిజంగా చింతిస్తున్నాను. ఇంత విచారము మునుపు నా కెప్పుడూ కలగలేదు. లలిత విడిచి వెళ్లేప్పుడు నాకు కన్నీళ్లు వచ్చినవి, చివరకు అప్పుడుకూడా నాకింత కష్టమనిపించలేదు" అన్నాను.

నా మాటల కతనికికూడా చిరునవ్వు వచ్చింది. అతను నవ్వగానే అతని దంతపంక్తి కనపడ్డది. ఆ దంతపంక్తి యథాప్రకారముగా స్వచ్ఛమై, శోభావంతమై సక్రమంగా ఉన్నది. నా కాశ్చర్యమువేసి "మదనా, నీదంతపంక్తి అంతచక్కగా ఉంటే దంతము పోయిన దంటానేం?" అన్నాను.

పాపమతను మళ్లీవిచారగ్రస్తుడై "చిలకా, నేను నోరు బాగా తెరవకపోతే అట్లాగే ఉంటుంది. పోయినది లోపలిదంతము!" అని చూపినాడు.

ఏమున్నది! అది చూడగానే నాకు చెప్పలేని రోత కలిగింది. కాని మళ్లీ రెండవ సారి తోచినమాట అనక అది దాచి అతన్ని సంతోష పెట్టడానికి "ఫరవాలేదు లేద్దూ మదనా, అది ఎవ్వరికీ కనపడదులే!" అన్నాను.

మళ్లీ నన్నతను "ఎవ్వరితోనూ చెప్పకు సుమా" అని మరీ మరీ చెప్పి వెళ్లి పోయినాడు.

## ౬

మళ్లా యథాప్రకారము మదనమోహనము స్నేహితులతో తిరగ సాగినాడు. వెనకటివలె అప్పుడప్పుడుకూడా ఫక్కుమని పెద్దనవ్వు నవ్వడ మొక్కటి లేదే కాని యథాప్రకారము అతని ముఖము ఉల్లాస పూరితమై ఉండసాగింది. జరిగిన ఆ కొత్త మార్పు స్నేహితు లెవ్వరూ గమనించ లేదు. ఆ తొర్రిపన్ను లోపలగా ఉన్నందు వల్ల అదికూడా వాళ్లు గమనించ లేదు. అంతే కాక వాళ్లలో ఎవరికన్నా ఆదరాతిశయము కలిగినప్పుడు ఒక్కొక్కసారి "మోహనము దంతపంక్తిలో నిజంగా మదనమోహనుడే" అనేవాళ్లు. ముఖ్యంగా అటువంటి వేళలలో నా నోరూరుకునేదికాదు. నిజము తెలిసిన నాకు చెప్పివేతా మని బుద్ధి పుట్టేది. కాని దానికి విరుద్ధంగా ప్రతిజ్ఞా బద్ధుడనై ఆపుకో సాగినాను. మాటిమాటికీ నా ప్రతిజ్ఞ నా సౌఖ్యానికి ప్రతిబంధకంగా ఉండ సాగింది.

ఆ రోజుల్లో ఎప్పుడూ మైదాసురాజు భార్యకథ జ్ఞాపకం వచ్చేది. అనగా అనగా మైదాసు అనే పేరుగల రాజొకడుండే వాడు. అతనికి అన్నీ మంచి గుణాలే. విశేష ధనవంతుడు, ప్రతాపశాలి, దివ్య సుందర విగ్రహుడు. కాని ఎప్పుడూ ఉష్ణీష మొకటి ధరించి ఉండేవాడు. ఆ దెందుకో మాత్రము ఎవరికీ బోధపడేది కాదు.

ఆ మహారాజు ఒక్క క్షణమైనా తల గుడ్డ తీసివేయడేమా అని ప్రతివాళ్ళకూ ఆశ్చర్యంగా ఉండేది. కాని ఎవరు రాయనను ప్రశ్నించగలరు? అందరికీ తెలుసుకోవాలె నని కుతూహల ముండేదే కాని ఎవ్వరూ అడగ సాహసించలేరు.

ఆ రాజుకు ప్రియురాలైన భార్య ఒకతె ఉన్నది. ఆమెతో కలిసిఉన్నప్పుడుకూడా మైడాసురాజుకు ఉష్ణీష ముండేది. "పక్క విడిచి వచ్చినతర్వాతకూడా ఉష్ణీషము తీసివేయరే" మని ఆమె చాలాసార్లు అడిగేది. రాణికి అడగడానికి ఏం భయము? కాని రాజు ఎన్నిసార్లో చెప్పక కప్పిపుచ్చి వాడు. చెప్పకుండా ఉన్నకొద్దీ తెలుసుకోవాలె నని రాణికి కుతూహల మెక్కువ కాసాగింది.

ఏమున్నది! అసలైన ఎప్పుడూ జరిగే కథేగా? చివరకు కొకనాడు రాణి భర్తను ఎక్కువ సంతోషపెట్టి ఉష్ణీషము తీయక పోవడానికి కారణ మడిగింది. రాజు కరుణార్ద్రీభూతచిత్తుడై "దేవీ, ఇది పరమ రహస్యము. నీవు పదిలముగా ఇతరులకు చెప్పకుండా ఉండగలవా?" అన్నాడు.

వావల్లే గాక ఆమె మహానందంతో సరే నని ఘోరంగా ప్రతిజ్ఞ చేసింది. రాజు రహస్యము చెప్పివేసినాడు. అతనివి 'గాడిద చెవులు.' అవి కనపడకుండా ఉండగలందులకే ఆ ఉష్ణీషము రాత్రింబగళ్లూ ధరిస్తాడు.

రాణికి రహస్యం తెలిసింది. రహస్యము ఒక్క పురుగుకుకూడా వెల్లడిచేయనని ఘోర ప్రతిజ్ఞ చేసిఉన్నది. ఎట్లా! అందరూ రాజును దివ్యసుందరవిగ్రహం అని పొగడే వాళ్లు! ఆమె అది విని ఎట్లా సహిస్తుంది? "మీకే నిజం తెలుస్తేనా?" అనుకునేది.

రోజులు గడిచిపోతున్నవి. రహస్యపు భారము రాణి భరించలేకుండా ఉన్నది. ఆమె కెప్పుడూ అదే వ్యథ. అందులో స్త్రీ ఆయెను! మన పురాణాల్లో విష్ణుమూర్తి రామావతారము ఎత్తబోతున్నాడనే రహస్యము దేవలోకంలో తెలుసుకొని ఆ రహస్యము ఆపుకోలేక పొట్ట ఉబ్బిపోతున్న నారదమహర్షి కథ వింటామే, అదిసంగానే అయింది ఆ గ్రీకురాణి అవస్థ. నారదుడు రహస్యమంతా పుట్టలో ఊది భారము తగ్గించుకున్నాడుట. అది వాల్మీకిమహర్షికి ఒక్కడికిమాత్రమే తెలిసింది. ఇక ఆ రాణి ఏమిచేసిందో, దాని ఫలిత మేమిటో వినండి!

ఆ పూర్వకాలపు సత్యయుగంలో రాజులకు, రాణులకు ఇప్పటివలె ఐశ్వర్యము, ఆడంబరము ఉండేవి కావు. వాళ్లుకూడా సామాన్యులవల్లెనే తమగృహకృత్యాలు తాము నిర్వర్తించుకునేవాళ్లు. పనిచేయడము అగౌరవమనేభావము వాళ్లలో ఇంకా పుట్టలేదు. కాబట్టి మైడాసురాజు పొలాలు దున్నేప్పుడు, గనులు తవ్వేప్పుడు తీరిక ఉంటే స్వయంగా అక్కడికి వెళ్లి పనులుచేయించేవాడు. రాణీకూడా రోజూ చెరువుకు బిందె చంకను పెట్టుకొని నీళ్లకు వెళ్లేది.

ఒకానొకరోజున ఉదయమే రాణి నీళ్లకు వెళ్లింది. అప్పటికి ఎవ్వరూ ఇంకా అక్కడికి రాలేదు. ఒక్కపెట్టుగా శివమెత్తినట్లు ఆమెకు రహస్యపుభార మావేశించింది. ఎవ్వరూ వినడంలేదుగదా అని ఎట్లాగో వంగి మెల్లిగా ఆ చెరువునీటితో "నాభర్తకు 'గాడిదచెవులు!' అందువల్లనే రాత్రింబగళ్లూ ఉష్ణీషము పెట్టుకోవడము! ఇది పరమరహస్యము!" అనేసింది. అంతటితో ఆమె హృదయభారం తీరింది! ఇక దాని ఫలిత మేమిటో వినండి!

గోడలకు చెవులు ఉంటవని అంటారు. వతే ఆ చెరువునీటికి చెవులే కాక నోరుకూడా ఎట్లా వచ్చినదో తెలియదు కాని ఆ ఉదయమే లోకానికంతా ఆ పరమరహస్యము వెల్లడి అయిపోయింది. అంతా మన రాజుని 'గాడిదచెవు' లని అనుకునేవాళ్లే! "ఇన్నాళ్లబట్టీ ఉష్ణీషమురహస్యము బయట పడలేదు. ఏదో ఇటువంటిది ఉంటుం దనుకుంటూనే ఉండేవాళ్లము!" అనుకొని అంతా మునిముసి నవ్వులు నవ్వుకునేవాళ్లే!

కొంతకాలము నాదికూడా ఆరాణి అవస్థ అయింది. అలవాటులేని ఈ పోషాకము ఎందుకు పెట్టుకున్నావా అని చింతించసాగినాను. ఎన్నడూ లేనిది నాలో ఏదో మార్పు ఉన్నట్లుగా స్నేహితులుకూడా గమనించసాగినట్లున్నారు. కాని నేను ఎక్కువ కాలము చింతతో బాధపడలేను! నాప్రకృతి అది! చివరకు ఒకనాడు నా రహస్యము స్నేహితులకు చెప్పివేశాను. ఆరోజున వాళ్లు మదనమోహనందంతో కొంతులనుగూర్చి మరీ ఎక్కువగా పొగడుతున్నారు. మోహన మప్పుడు అక్కడే ఉన్నాడు. నాకేసి అతను దీనంగా చూస్తున్నాడు. ఇక నేను ఆపుకోలేకపోయినాను, చెప్పేశాను!

"పాపము, మదనమోహనానికి పన్నొకటి ఊడిపోయింది. ఇంక ఏమి ఉంది ఏమి లాభము!" అనేశాను.

దానితో నాభారం తీరింది. నా కష్టం మాయమయింది. ఎన్నటికీ మళ్లీ రహస్యం దాస్తానని గట్టిగా వాగ్దానం చేయకూడ దనుకున్నాను.

కాని ఆ ఒక్కసారి వాగ్దత్తముచేసిన ఫలమేమిటో తెలుసునా! నన్ను చూసి అపహాస్యంచుకోనేవాళ్లు ఈ ప్రపంచకంలో ఎవ్వరూ లేరు కాని ఆ మదనమోహనము మాత్రము నాతప్పు మన్నించలేదు. మరి నాతోగాని, నా స్నేహితులతోగాని అతను మాట్లాడలేదు. నన్నుకూడా లోకంలో ఒకరు విరోధభావంతో చూస్తున్నారుగదా అనే భావం నాకు మొదటిసారి కలిగింది. నాకు ఎక్కువగావిచారపడడము చేతకాదు. కాని ఈ విషయమైన చింత ఒక్కటి మాత్రము నా జీవితరాగములో అపశ్రుతివలె బాధిస్తున్నది.

నా ప్రతిజ్ఞాచిహ్నము ఒక్క మదనమోహనం మనస్సులో మాత్రమే ఉండిపోయినా నే నంతగా విచారపడేవాణ్ణి కాదు. అది నా

దేహాన్నే ప్రత్యక్షంగా వచ్చి ఆవేశించింది. అసంభావమైన జరిగినమర్నాడు అద్దంలో నా దంతపంక్తి చూసుకోగా, సరిగ్గా ఎటువైపున ఎన్నవదంతము మదనమోహనానిది ఊడిపోయిందో, ఆ దంతముమీదనే, నాస్వంత దంతముమీదనే మచ్చ ఒకటి ఏర్పడ్డది. అది నా కళ్లబడగానే చేతులోని అద్దము జారి కింద పడిపోయింది. కళ్లవెంబడి నీళ్లు కారినవి. లోకములోని బాధ నాకు తెలియవచ్చింది. ఆదాము, హవ్వలు సైతానుకు లొంగిపోయినారు.

ఈ లోపము నా దేహాన్ని ఆవహించి ఉన్నందువల్లనేనేమో మునుపు నామీద కోపము వచ్చిన ఇతరులను వలెనే నేను ఈ మదనమోహనముకోపము జయించలేక పోయినాను!

కాని ఇందులో ఒక్క వివేకకార్యము మాత్రము చేసినాను. మదనమోహనమువలె నాకోపము కప్పిపెట్టవలెనని ప్రయత్నించక స్నేహితులందరికీ ఆపూటే చెప్పివేశాను. మనసులోమాట దాచవలెనని కొన్నాళ్లు ప్రయత్నించినందుకు ఈ శాస్తి అనుభవించి



కూడా మళ్లీ ఆపొరపాటు చేస్తానా? నా స్నేహితులందరికీ నా దంతలాంఛనము సంగతి తెలుసును. అందుకనే మావూళ్లో కవి "మన చిలకేశు దంతలాంఛనము చంద్రునికి కళంకమువల్లె ఒకటి ఉన్నా చిలక అమృతస్వరూపుడుగదా!" అంటూ ఉంటాడు.

కళంకం వంటిమీదఉన్న చంద్రుడికి మనస్సులో బాధ ఉంటుందో, ఉండదో నే నెరగను గాని ఈ దంతలాంఛనము నాకుమాత్రము అశాంతి కలిగిస్తున్నది.